ధాన్యాన్ని వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలి

- ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరగాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్: రెడ్డిపల్లి కొనుగోలు కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

తూప్రాన్: వెంకటరత్నాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న ఆర్డీవో జయ చంద్రారెడ్డి

పెద్దశంకరంపేట: రామోజలిపల్లి కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్ గ్రేసీబాయి

నర్సాపూర్, మే 25: మండలంలోని రెడ్డిపల్లి కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగింపు దశలో ఉన్నదని, త్వరితగతిన కేంద్రంలోని ధాన్యాన్ని రైస్‌మిల్లులకు వెంటవెంటనే తరలించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయని, గత సీజన్‌లో 1,51,609.960 టన్నుల ధాన్యం కొన్నట్లు తెలిపారు. జిల్లాలోని 410 కేంద్రాల్లో 5 మాత్రమే ధాన్యం కొనుగోలు పూర్తి చేశాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 410 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 2,40,908.080 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.382.43 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. 163 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పూర్తయ్యిందన్నారు. మెదక్ జిల్లా నుంచి సిద్దిపేట జిల్లాకు 10 వేల మెట్రిక్ టన్నులు, మహబూబ్‌నగర్ జిల్లాకు 40 వేల మెట్రిక్ టన్నులు, జోగులాంబ గద్వాల్‌కు 10 వేల మెట్రిక్ టన్నులు తరలించేందుకు ఆర్డర్ వచ్చిందన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి తదితరులు ఉన్నారు.

స్ట్రాంగ్‌రూమ్, సీసీ కెమెరాలను పరిశీలించిన కలెక్టర్

నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరా హార్డ్‌డిస్క్‌ను, మూడంచెల భద్రత పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌తో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి ఉన్నారు.

రెండు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి

- పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు

కొల్చారం, మే 25: రంగంపేటలో ఇప్పటివరకు 70 వేల బస్తాల ధాన్యం కొన్నట్లు తెలిపారు. మరో 5 వేల బస్తాల ధాన్యం కొనుగోలు రెండు రోజుల్లో పూర్తవుతుందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు తెలిపారు. శనివారం మండలంలోని రంగంపేట సొసైటీ పరిధిలోని ధాన్యం కొలుగోలు కేంద్రాన్ని సందర్శించారు. సొసైటీ రికార్డులు పరిశీలించారు. చైర్మన్ అరిగె రమేశ్, సీఈవో నవీన్‌ను ధాన్యం కొనుగోలుపై అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి మిల్లులకు ధాన్యం సరఫరా పూర్తవడంతో మిగులు ధాన్యాన్ని గద్వాల, మహబూబ్ నగర్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

3.82 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు: ఆర్డీవో

తూప్రాన్, మే 25: డివిజన్‌లో 3.82 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తూప్రాన్ ఆర్డీవో ఎం.జయచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఉమ్మడి తూప్రాన్ మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. మండలంలోని రావెళ్లి, వెంకటరత్నాపూర్, మనోహరాబాద్ మండలంలోని కూచారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించిన ధాన్యం మిల్లర్లకు చేరవేయడంతోపాటు వారి నుంచి వస్తున్న ఇబ్బందులపై కేంద్ర నిర్వాహకులకు సూచనలు, సలహాలు చేశారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

పెద్దశంకరంపేట, మే 25: మండలంలోని రామోజిపల్లి, వీరోజిపల్లి, కొత్తపేట, పెద్దశంకరంపేట తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం తహసీల్దార్ గ్రేసీబాయి తనిఖీ చేశారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు: ఎస్పీ బాలస్వామి

బాలస్వామి, ఎస్పీ

మెదక్ అర్బన్, మే 25: నకిలీ విత్తనాలు, ఎరువులు, నాసిరకం పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డాక్టర్ బాలస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులను మోసం చేస్తూ కొంతమంది దళారులు నకిలీ విత్తనాలు చేస్తూ రైతులను నష్టాల్లోకి నెడుతున్నారని పేర్కొన్నారు. పోలీసు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తూ పక్కా సమాచారంతో నకిలీ విత్తనాల సరఫరా, విక్రయాలు జరిపితే వారిపై దాడులు చేస్తామని హెచ్చరించారు.

ఖాళీల భర్తీకి కౌన్సెలింగ్

నర్సాపూర్, మే 25: నర్సాపూర్ సమీపంలోని తెలంగాణ గిరిజన బాలుర గురుకుల కళాశాలలో 2024-25 సంవత్సరానికి సీఈసీ, ఒకేషనల్ కోర్సులో ఖాళీలు భర్తీ చేసేందుకు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షమయ్య ప్రకటనలో పేర్కొన్నారు. ఒరిజినల్ పత్రాలను తమ వెంట తీసుకుని ఈ నెల 28న నర్సాపూర్ గిరిజన బాలుర కళాశాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హాజరుకావాలని తెలిపారు.

అలరించిన కుస్తీ పోటీలు

కుస్తీ పడుతున్న మల్లయోధులు

పెద్దశంకరంపేట, మే 25: మండలంలోని చీలపల్లి గ్రామంలో కొనసాగుతున్న దుర్గమ్మ జాతరలో శనివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. మండలంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి మల్లయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు.

కొల్చారంలో ప్రైవేటు పాఠశాల గుర్తింపు రద్దు

లేక్‌వ్యూ టాలెంట్ పాఠశాల

కొల్చారం, మే 25: కొల్చారంలోని లేక్‌వ్యూ టాలెంట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల గుర్తింపును రద్దు చేస్తూ డీఈవో రాధాకిషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవో నీలకంఠం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ అనుమతుల ప్రకారంగా పాఠశాల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో రద్దు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

పద్మశాలీలు ఐక్యంగా ఉండాలి

కౌడిపల్లి, మే 25: పద్మశాలీలు ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాడాలని జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మేకల జయరాములు తెలిపారు. శనివారం కౌడిపల్లికి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికలు త్వరలో జరుగనున్నాయన్నారు. ఓటు హక్కు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయనతో రాష్ట్ర కార్యదర్శి వనం నర్సింలు, మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు నర్సింలు, పోల జనార్దన్, ప్రభాకర్, రంగేశ్, శేఖర్ ఉన్నారు.

రైతుభరోసా ఇవ్వాలి

శివ్వంపేట, మే 25: జూన్ మొదటి వారంలోనే రైతు భరోసాను రైతుల ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్య యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం రైతులు ఎరువులు, విత్తనాలు తెచ్చుకోవడానికి ఉపయోగపడతాయన్నారు. కౌలు రైతులను గుర్తించే ఆదుకోవాలని కోరారు. రైతు భరోసాను వెంటనే అమలు చేసేలా ప్రభుత్వం చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి

- లైసెన్స్‌లున్న దుకాణాల్లోనే విత్తనాలు కొనాలి
- ప్యాకింగ్ లేని విత్తనాలు కొనొద్దు
- డీలరు వద్ద రసీదు తప్పకుండా తీసుకోవాలి
- పంట చేతికొచ్చే వరకు ప్యాకెట్ భద్రపర్చాలి

నర్సాపూర్, మే 25: ప్యాకింగ్ లేని విత్తనాలు కొనొద్దని ఏడీఏ సంధ్యారాణి సూచించారు. శనివారం మండలంలోని సీతారాంపూర్‌లో విత్తనాల కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో చంద్రవేణి, మాజీ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం, మే 25: విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్త వహించాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు రాంప్రసాద్ సూచించారు. మండలంలోని చిల్వేర, రెడ్డిపల్లి, మహమ్మదాపూర్, కాయిదంపల్లి, ముప్పారం, అప్పాజిపల్లి గ్రామాల్లో విత్తనాల కొనుగోలుపై శనివారం అవగాహన కల్పించారు. డీలర్ల నుంచి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. చిల్వేర గ్రామంలోని లక్ష్మి ట్రేడర్స్‌లో మండల వ్యవసాయ అధికారి రాజేశ్‌తో కలిసి తనిఖీలు చేశారు. తనిఖీలో వ్యవసాయ విస్తరణ అధికారులు నవీన్, మహేశ్, అమృత్, విఠల్‌రావు ఉన్నారు.

రేగోడ్‌లో..

రేగోడ్, మే 25: మండలంలోని ఆర్ ఇటిక్యాల్, జగిర్యాల, మర్పల్లి, రేగోడ్, సింధోల్, పోచారం గ్రామాల్లో విత్తన కొనుగోలుదారులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఏవో జావేద్ తెలిపారు. నకిలీ విత్తనాలను ఎలా గుర్తించాలో రైతులకు సూచించారు. గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గరే విత్తనాలు కొనాలన్నారు. ఏఈవో వినీత్ కుమార్, సునీల్‌కుమార్, భూలక్ష్మి ఉన్నారు.

చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, మే 25: నకిలీ విత్తనాలు కొని రైతులు నష్టపోవద్దని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి సూచించారు. శనివారం చిలిపిచెడ్, చండూర్, ఫైజాబాద్, గుజిరి తండాలో విత్తన కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో ఏఈవోలు రమ్య, భూపాల్, రైతులు కిషన్‌రెడ్డి, యాదయ్య, మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి, మే 25: విత్తనాలు కొనే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కౌడిపల్లి డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ పుణ్యవతి సూచించారు. శనివారం మాసాయిపేట మండలంలోని రామంతపూర్, లింగారెడ్డి పల్లి గ్రామాల్లో ఏవోలు రాజశేఖర్, ఝాన్సీతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. వెల్దుర్తి మండలంలోని ధర్మారం, మన్నే వారి జలాల్‌పూర్, ఉప్పులింగాపూర్, శెట్టిపల్లి గ్రామాల్లో అవగాహన కల్పించారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట, మే 25: రైతులు విత్తనాలు తీసుకునే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయం సహాయ సంచాలకులు సంధ్యారాణి అన్నారు. శనివారం మండలంలోని పిలుట్ల గ్రామంలో ఏవో లావణ్యతో కలిసి విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట, మే 25: రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుని నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఈవో స్వాతి అన్నారు. పెద్దశంకరంపేట, బుజ్రాన్‌పల్లి, గోపని వెంకటాపురం, దానంపల్లి, ఆరెపల్లి, శివయపల్లి, చీలపల్లి గ్రామాల్లో అవగాహన కల్పించారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, మే25: ప్రభుత్వం అనుమతిచ్చిన విత్తనాలే రైతులకు అందించాలని ఏడీఏ విజయనిర్మల డీలర్లకు ఆదేశించారు. మండలంలోని గవ్వపల్లి తండా, కామారంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆమె వెంట ఏఈవో లక్ష్మీప్రవీణ్ పాల్గొన్నారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్, మే 25: లైసెన్స్‌లున్న దుకాణాల్లోనే విత్తనాలు కొనాలని తూప్రాన్ ఏఈవో సంతోష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఇమాంపూర్, ఘనపూర్ గ్రామాల్లో విత్తనాలపై అవగాహన కల్పించారు.

కౌడిపల్లిలో..

కౌడిపల్లి, మే 25: విత్తన కొనుగోళ్లపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రతలపై కౌడిపల్లి, ధర్మాసాగర్, తునికి, హరిచంద్‌తండా, మహమ్మద్‌నగర్, శేరితండాల్లో ఏవో స్వప్నా జాదవ్ అవగాహన కల్పించారు. సమావేశంలో ఏఈవోలు రాజశేఖర్, దివ్యశ్రీ, గౌతమి, రైతులు పాల్గొన్నారు.

చేగుంటలో..

చేగుంట, మే 25: విత్తన కొనుగోలుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని రామాయంపేట ఏడీఏ వసంత సుగుణ అన్నారు. ఏఈవో హరిప్రసాద్‌తో కలిసి అనంతసాగర్, పెద్దశివునూర్, రుక్మాపూర్, పులిమామిడి గ్రామాల్లో శనివారం రైతు సదస్సులు నిర్వహించారు. ఏఈవోలు శోభరాణి, భూవనేశ్వరి, అశోక్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయాల్లో జడ్పీ సీఈవో తనిఖీ

కౌడిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీ చేస్తున్న జడ్పీసీఈవో ఎల్లయ్య

నర్సాపూర్, మే 25: నర్సాపూర్‌లోని ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో ఎల్లయ్య, జడ్పీ డిప్యూటీ సీఈవో రంగచార్యులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు.

కౌడిపల్లిలో..

కౌడిపల్లి, మే 25: కౌడిపల్లిలోని ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో ఎల్లయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులు పరిశీలించారు. పెండింగ్ ఉన్న పనులు వెంటనే పూర్తిచేసి రికార్డులో ఉంచాలని సూచించారు. నీటి సమస్య ఉంటే వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. ఉపాధి పనులు జరుగుతున్నాయా బిల్లులు సక్రమంగా వస్తున్నాయా అన్న విషయాలను ఏపీవో పుణ్యాదాస్‌ను అడిగి తెలుసుకున్నారు.

సేవా ధోరణితో మీసేవ కేంద్రాలు పని చేయాలి

మాట్లాడుతున్న ఈడిస్ట్రిక్ మేనేజర్ సందీప్, పాల్గొన్న కేంద్రాల నిర్వాహకులు

మెదక్, మే 25 (నమస్తే తెలంగాణ): ప్రజా సేవ చేసేలా మీసేవ కేంద్రాలు పనిచేయాలని ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్ఐసీ హాల్‌లో ఆధార్ సెంటర్లో సమస్యలు, వన్ స్టాప్ సర్వీసెస్, స్త్రీనిధి, వన్ స్టాప్ సర్వీసెస్‌పై మీసేవ కేంద్రాలు, వన్ స్టాప్ సెంటర్ ఆధార్ సెంటర్ నిర్వాహకులతో సమీక్షించారు. సేవా దృక్పథంతో మీసేవ కేంద్రాలు పని చేయాలని, ప్రభుత్వం పొందుపరిచిన ధరల సమాచార బోర్డు ఏర్పాటు చేసి, ఆ ధరలకే ప్రజల సేవలు అందించాలన్నారు. మీసేవ కేంద్రాల పనితీరును జిల్లాలో ఆకస్మికంగా ఎప్పుడైనా తనిఖీ చేయవచ్చన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోమన్నారు. కార్యక్రమంలో డీఎంటీఎస్ టీఎస్ శశికాంత్, డీఎంసీఎస్‌సీ స్త్రీనిధి, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోంచి వెళ్లి.. శవమై తేలాడు

మనోహరాబాద్, మే 25: మద్యానికి డబ్బులు ఇవ్వమని తల్లితో గొడవ పడి మూడు రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లిపోయిన వ్యక్తి శనివారం కాళ్లకల్ గ్రామంలోని కుంటలో శవమై తేలిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హవేళీఘనపూర్ మండలం ముత్తాయపల్లికి చెందిన దోమకొండ భాగ్యమ్మ తన కుటుంబంతో కలిసి ఇరవై ఏండ్లుగా కాళ్లకల్‌లో ఉంటున్నది. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నది. ఆమెకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు సాయికుమార్‌గౌడ్ (23) ఈనెల 21న రాత్రి పూటుగా తాగి ఇంటికి వచ్చాడు. ఇంకా తాగడానికి డబ్బులు కావాలని తల్లిని అడగడంతో ఇప్పటికే తాగి ఉన్నావు కదా అని మందలించింది. దీంతో బయటకెళ్లిపోయాడు. శనివారం ఉదయం కాళ్లకల్ గ్రామానికి చెందిన శేఖర్, సాయికుమార్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, గ్రామంలోని రాఘవేంద్ర హోటల్ వెనకాల గల కుంటలో సాయి మృతి చెంది ఉన్నాడని తెలిపాడు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా సాయి కుమార్ మృతిచెందాడు. మృతుడి తల్లి భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట, మే 25: లారీ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కొర్విపల్లి గ్రామ శివారులో మెదక్ చేగుంట రహదారిపై శనివారం జరిగింది. జీడిపల్లి గ్రామానికి చెందిన కిరణ్ ద్విచక్రవాహనంపై మెదక్‌లో బంధువుల అంత్యక్రియలకు వెళ్లి, తిరిగి వస్తున్నాడు. కొర్విపల్లి శివారులో చేగుంట నుంచి మెదక్ వైపు వెళ్తున్న లారీ బైక్‌ను బలంగా ఢీకొంది. దీంతో కిరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నశంకరంపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన కిరణ్‌ను దవాఖానకు తరలించారు.

పంచాయతీ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు: డీపీవో

పెద్దశంకరంపేటలో వైకుంఠధామం పరిశీలిస్తున్న డీపీవో యాదయ్య

పెద్దశంకరంపేట, మే 25: గ్రామ పంచాయతీ ఆస్తులు పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీపీవో యాదయ్య తెలిపారు. శనివారం పెద్దశంకరంపేట మేజర్ పంచాయతీలో నర్సరీ, వైకుంఠధామం, డంప్‌యార్డు, క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనం నిర్వహణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఈవో వెంకట్రాములు, సిబ్బంది నందు, తదితరులు ఉన్నారు.

ఓబీసీ హోదా రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నాం: బీజేపీ

మాట్లాడుతున్న ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్

నర్సాపూర్, మే 25: ముస్లిం ఉపకులాలకు ఇచ్చిన ఓబీసీ హోదాను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్‌లో ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ హైకోర్టు తీర్పును ధిక్కరిస్తూ సుప్రీంకోర్టుకు వెళ్తాననడం దురదృష్టకరమన్నారు. రాబోయే రోజుల్లో ఓబీసీలు మమతా బెనర్జీకి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఆయనతో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమణారావు, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మండల అధ్యక్షుడు నీలి నాగేశ్, నాయకులు బాలరాజు, రాజు తదితరులు ఉన్నారు.

కూలిన ఇండ్లకు పంచనామా



పంచనామా నిర్వహిస్తున్న అధికారి

కొల్చారం, మే 25: మండలంలోని తుక్కాపూర్‌లో రెండు రోజుల క్రితం కురిసిన గాలివానకు గ్రామానికి చెందిన బాల సుగుణమ్మ, చిన్న లచ్చిగారి దానయ్యకు చెందిన రేకుల ఇండ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కొల్చారం తహసీల్దార్ గఫర్ మియ్య ఆదేశాల మేరకు ఆర్ఐ ప్రభాకర్ శనివారం గ్రామాన్ని సందర్శించి కూలిన ఇండ్లకు పంచనామా నిర్వహించారు. ఒక్కో ఇంటికి రూ.45 వేల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేసినట్లు తెలిపారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు, ఆరె రవీందర్, గ్రామస్తులు ఉన్నారు.

పాఠశాలల పనులు వేగంగా పూర్తి చేయాలి

మెదక్ మున్సిపాలిటీ: సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

వెల్దుర్తి: బండపోసానిపల్లి పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న డీఈవో రాధాకృష్ణన్

- అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ మున్సిపాలిటీ, మే 25: జూన్ 10వ తేదీలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రమేశ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో విద్యాశాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న పనుల పురోగతిని ఆరా తీశారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పనులన్నింటిని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడమే లక్ష్యంగా మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో మైదానాలకు ఉపాధి పథకంలో చదును చేయాలన్నారు. రానున్న హరితహారంలో పండ్ల మొక్కలు నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీఈవో రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో డీఈవో రాధాకిషన్

వెల్దుర్తి, మే 25: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ప్రభుత్వం చేపట్టిన పనులను వేగవంతం చేయాలని డీఈవో రాధాకిషన్ అన్నారు. శనివారం మండలంలోని బండపోసానిపల్లి, ఎద్దులపల్లి, రామాయపల్లి, ఆరెగూడెం, ఉప్పులింగాపూర్, ఉప్పు లింగాపూర్ తండాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఎంఈవో యాదగిరితో కలిసి పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం కావడానికి ముందే పనులు పూర్తి చేయాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

చిట్కుల్‌లో ఎండకు ఆరబెట్టిన ధాన్యం కుప్పలు

చిలిపిచెడ్, మే 25: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని మండలంలోని చిట్కుల్, చండూర్, చిలిపిచెడ్, అజ్జమర్రి గ్రామాల రైతులు కోరుతున్నారు. నెల రోజుల నుంచి ధాన్యం కుప్పలుగా పోశామని, కాంటా కోసం వేచి చూస్తున్నామని పేర్కొంటున్నారు. రోజూ తూకం కావడం లేదని, లారీలు సరిగా రావడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

చండూర్‌లో ధాన్యాన్ని ఎండబెడుతూ సామ్మసిల్లి పడిపోయిన రైతు

బీడి కార్మికులకు వేతనాల పెంపుపై ఒప్పందం

చేగుంట, మే25: బీడీ కార్మికులకు వేతనాల పెంపుపై నూతన ఒప్పందం జరిగిందని, హెచ్ఎంఎస్ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇదారి మల్లేశం తెలిపారు. 30 ఏప్రిల్ 24 వరకు ఉన్న అగ్రిమెంట్ ముగిసిపోవడంతో, హైదరాబాద్ మినర్వాడి గ్రాండ్ హోటల్ శనివారం జరిగిన సమావేశంలో కంపెనీ యాజమాన్యం తరపున అసోసియేషన్ అధ్యక్షుడు జితేంద్ర, ఉపాధ్యాయ ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, గాంధీ అసోసియేషన్ సభ్యుడు రమ్మికాంత్ పటేల్ పాల్గొన్నారు. నూతర అగ్రిమెంట్ ప్రకారం ప్యాకింగ్ కార్మికులకు నెలకు రూ.3వేల 50, వెయ్యి బీడీలకు రూ.4.25 అదనంగా పెరిగిందన్నారు.

ఘనంగా శీతలాదేవి మడేలేశ్వర కల్యాణం

నిజాంపేట, మే 25: మండలంలోని నందిగామలో శీతలాదేవి మడేలేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని రజక సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో శీతలాదేవి మడేలేశ్వర కల్యాణం జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు. రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సంగుస్వామి, గ్రామ అధ్యక్షుడు లింగస్వామి, ఉపాధ్యక్షుడు పరశురాములు, సభ్యులు దుర్గయ్య, నర్సింహులు, మల్లేశ్, నాగరాజు, లక్ష్మణ్, ప్రశాంత్ ఉన్నారు.

వాంతులు విరేచనాలతో గిరిజన మహిళ మృతి

కౌడిపల్లి, మే 25: వాంతులు విరేచనాలతో గిరిజన మహిళ మృతిచెందిన ఘటన కౌడిపల్లి మండలం లింగంపల్లితండాలో శనివారం జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లితండాకు చెందిన ముడేరి ముత్యాలి(48) సోమవారం తన చెల్లెలు నర్సాపూర్ మండలం జానకంపేట తండాకు చెందిన మలావత్ చక్రు పూరి ఇంటికి దావత్‌కు వెళ్లింది. దావత్ పూర్తైన తర్వాత బంధువులు వారి సొంత గ్రామాలకు చేరుకోగా ముడేరి ముత్యాలితో పాటు కుటుంబసభ్యులు అక్కడే ఉన్నారు. మొదట ముత్యాలి కోడలు తేజకు వాంతులు విరేచనాలైతే మెదక్ దవాఖానకు తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. మళ్లీ విరేచనాలు ఎక్కువ కావడంతో శనివారం మెదక్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రైవేట్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో ముత్యాలి చనిపోయింది. ముత్యాలి కోడలు తేజను మెదక్‌లోని రష్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. వివరాలకు సంప్ర: 8143366630 / 9989554915. NT-806

WANTED

★బ్యాట్రి, ఆటో ఎలక్ట్రికల్ వర్క్ పని వచ్చినవారు కావలెను. పురుషులు మాత్రమే. సంప్ర: 9849727105. NT-333859

★Well Qualified Experienced High School